

"వచ్చేడ్రా యమధర్మరాజు. జీతాలింకా యివ్వనేలేదు. వీడు ప్రత్యక్షం. ఆ క్యాషియర్ రావటమైనా ఆలస్యమవుతుంది కాని వీడుమాత్రం రంచనుగా వచ్చేస్తాడు"

"బాబోయ్. వచ్చేశాడూ? ఈనెలబోల్డు కటింగ్స్ ఉన్నాయి. ఇంకా వీడి వడ్డీ వకటా?"

"నువ్వు లక్షకథలు చెప్పినా సరే నయాన్నో భయాన్నో బెదిరించో బులిపించో వడ్డీ వసూలుచేయకమానడు ఎందుకు వచ్చినగోల? మన కొచ్చిన దెలాగూ చాలదుకాని, వాడికియ్యవలసింది వాడికిచ్చెయ్."

"ఇదిగో అరియర్స్ వచ్చేస్తున్నాయ్. అదిగో డబ్బులిచ్చేస్తారు అంటూ ఆర్నెల్లు నుండీ కాచుకునే కూర్చున్నాము. అవేవో వస్తే వీడి అప్పయినా తీ ర్చేద్దా మను కున్నాను."

"అబ్బే అసలుదేముంది సార్ ప్రతినెలా వడ్డీమాత్రం అణాపైసలతో

నాకిచ్చెయ్యండి. అంతేచాలు. అదియ్యక పోతే మాత్రం ఊరుకునేదిలేదు" అంటాడు పైగా.

"అవును. అసలుకంటే వడ్డీముద్దు. నెలకి కొన్నివందలు వడ్డీల రూపంలో వసూలౌతూవుంటే వాడికి అసలెందుకు?

"అంత మనిషి ఉన్నాడా? పిడికెడు అన్నం పట్టే చిన్నడబ్బి తెచ్చుకుంటాడు. అదీ చద్దన్నం. నంచుకోవటానికో ఉల్లి పాయ. యింక పిల్లలు. వాళ్ళ సంగతి చెప్పనే అక్కర్లేదు. తలకో నూనెచుక్క ఎరుగరు. చిరుగని బట్టలెరుగరు"

"అందుకేనయ్యా బాబూ! అతను అప్పిచ్చేవాడు. మనం పుచ్చుకునేవాళ్ళ మయ్యాం ..."

మధ్యతరగతి జీవితానికి తగుళ్ళేకాని మిగుళ్ళుండవు. అందుకే తొంభై శాతం మనుషులు నెలముందు నుంచీనో చివర నుంచీనో అప్పులకు బయలుదేరడ మౌతుంది.

అప్పులిచ్చినవాళ్ళు అసలో వడ్డీయో వసూలు చేసుకోడానికి కఠినంగా ఉండటం తీర్చవలసిన వాళ్ళువాళ్ళని చూడగానే భయ పడటం, తిట్టుకోటం. సాధారణంగా జరి గేవే. అప్పులు తీసుకొన్నప్పుడు ఎలా గయినా కావాలని, ఎంతో సౌమ్యంగా మాట్లాడి. కాళ్ళావేళ్ళాపడి (అవసరమైతే) వాళ్ళు చెప్పిన కండిషన్సు అన్నింటికీ తలవంచి తీసుకుంటారో, తిరిగి యిచ్చి నప్పుడు అన్యాయంగా యింత డబ్బు పోతూందే అని బాధపడ్తారు. విసుక్కుం టారు. ఉసూరుమంటారు.

ఆ ఆఫీసులో వాళ్ళందరూ సాధార ణంగా ఒకడి దగ్గరే అప్పు తీసుకుంటారు. తీసుకున్నప్పుడు రాముడిలాగ, దేముడి లాగే కన్పించినవాడే ఫస్టుతారీఖు వడ్డీ వసూళ్ళకై వచ్చేసరికి యమధర్మరాజై పోతాడు. వెనుక ఎన్ని మాటలనుకున్నా అతనిముందు మాత్రం కిక్కురుమనరు జీతమందుకోగానే ముందు ముడుపుచెల్లిం చేసి తరువాతనే కాఫీలకు వెళ్తారు లేదంటే ఏంగొడవ పెడ్తాడో అని భయం

* * *

"మన యమధర్మరాజు చచ్చిపోయే డుట. .."

"ఎంత చల్లనివార్త తెచ్చేవు గురూ ఇకనయినా మనకీ అప్పుల బెడద తప్పు తుందేమో...."

"వాడైతే హాయిగా పోయేడు గని మన కష్టాలు, అవసరాలు ఎక్కడికి పోయేయి? ఈనెల ఎవరప్పు యిస్తారా అని నేను ఆలోచిస్తున్నాను."

"ఇంతకీ . .ఎప్పుడు చచ్చిపోయాడు మేళతాళాలలో పంపించేశారా?"

"బ్రతికున్నప్పుడు తను శుభ్రంగా తిన లేదు. శుభ్రమైన బట్టకట్టలేదు. అటువంటి వాడు ఛస్తే ఊరేగింపుకూడ ఎందుకు?

"ఏమైనా భార్యా పిల్లలు ఉన్నారుకదా పాపం వాళ్ళెంత ఏడుస్తున్నారో?"

"ఆ .. ఏడుస్తున్నారు—వాడు చచ్చిన దానికంటే యింట్లో పైసాకూడా వుంచ కుండా డబ్బంతా ఊరిపాలు చేశాడో అని ఏడుస్తున్నారు. ప్రస్తుతం ఆ వీధిలో వాళ్ళందరూ ఏదో చందాలెత్తి శవాన్ని లేవనెత్తారు."

"అయ్యో పాపం. ..ఊళ్ళోని అప్పు లన్నీ వసూలౌతేగాని వాళ్ళ రోజులు గడ వటం కష్టమే కాబోలు."




ఆ.. వాడు బ్రతికున్నన్నాళ్ళు ఎక్కడ డబ్బులు ఖర్చయిపోతాయో అని శుభ్రంగా తిని తిరగనిచ్చేవాడు కాదు. పోతూపోతూ డబ్బంతా ఊరాళ్ళమీద ఉంచేసి వెళ్ళిపోయాడు. బాకీలన్నీ వసూలవాలి. కాస్త వాళ్ళకాధారం దొరకాలి.''

* * *

"ఎవరా అబ్బాయి? ఈ వాచ్‌మాన్ ఏంచేస్తున్నాడో? ప్రతి ముష్టివెధవని లోనికి పంపించేస్తాడు."

"ముష్టివాడు కాదుగురూ. మన యమధర్మరాజు కొడుకు చిన్నయముడు."

"ఏమిటో? ఇకమీదట వీడు వస్తాడా వడ్డీల వసూళ్ళకి....?"

"వడ్డీలకి కాదుగురూ. అసలుకే. 'మా నాన్న వడ్డీవ్యాపారంచేసి మమ్మల్నిలా ముంచేసాడు. మాకు వడ్డీవద్దు. ఏంవద్దు. అసలు ఎంత అప్పున్నారో యిచ్చేయండి ఏదయినా వ్యాపారం పెట్టుకుంటాం అంటున్నాడు."

"ఏమిటో? అసలు డబ్బేకావాలా? అంతడబ్బు మనదగ్గరెక్కడుంది? అదే వుంటే ఇలా అప్పులెందుకు చేస్తాం."

"అవునవును. అసలెక్కడుంది మన దగ్గర? అసలు మనకి డబ్బెవ్వరిచ్చారు? లెక్కలూ పత్రాలూ వాడిదగ్గరేమైనా వున్నాయా?"

"అవునవును. మనం చేసిన అప్పు వాడి బాబుదగ్గర అది ఎప్పుడో చెల్లు వేసేశాము. లేదా కాలదోషం పట్టిపోయింది. వెళ్ళమనండి. ..అకుర్రవాణ్ణి. ప్యూన్‌తోచెప్పి బయటకు పంపించెయ్యమనండి." □